క్లుప్తంగా

రెండ్రోజులు నీటి సరఫరా నిలిపివేత



కొల్లాపూర్: పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే మిషన్‌భగీరథ పైపులైన్ ఎన్మన్‌బెట్ల క్రాస్ రోడ్ సమీపంలో లీకేజీకి గురైంది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి పైపులైన్ ఒకే ప్రాంతంలో మూడు చోట్ల లీకేజీకి గురై నీళ్లు బయటికి ఎగిసి పడుతున్నాయి. స్థానికులు మున్సిపల్ అధికారులకు సమాచారం అందించడంతో మరమ్మతులు చేపట్టారు. దీంతో పట్టణానికి రెండు రోజుల పాటు తాగునీటి సరఫరా నిలిచి పోతుందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ వెల్లడించారు. త్వరితగతిన మరమ్మతు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

అచ్చంపేటలో..

అచ్చంపేట రూరల్: లీకేజీల మరమ్మతులో భాగంగా రెండు రోజుల పాటు నియోజకవర్గానికి మిషన్ భగీరథ నీటి సరఫరాను బంద్ చేస్తున్నామని వాటర్ గ్రిడ్ డీఈ మణిపాల్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని పంచాయతీల్లో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తగా అన్ని గ్రామాలకు సరిపడా నీటిని సరఫరా చేయడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని పేర్కొన్నారు.. గ్రామాల్లో ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

వాహనాల తనిఖీ



తాడూరు: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట ప్రధాన రోడ్డుపై శుక్రవారం సాయంత్రం ఎస్‌ఐ పుట్ట మహేష్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. మైనర్‌లకు వాహనాలు ఇస్తే, వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు.

మిత్రుడికి ఆర్థికసాయం



ఉప్పునుంతల: మండలంలోని కొత్త రాంనగర్ చెందిన అనుపటి జానయ్య రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వెల్దండలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం అతని స్నేహితులు 2004–5 టెన్త్ బ్యాచ్ జెడ్పీహెచ్‌ఎస్ ఉప్పునుంతలలో చదువుకున్న వారు ఆస్పత్రికి వద్దకు వెళ్లి జానయ్యను పరామర్శించారు. తమ వంతు సాయంగా రూ.22వేలు అందజేశారు. మహేష్‌రెడ్డి, ఎల్లయ్యయాదవ్, చిన్నజంగయ్య, బాలస్వామి, వెంకటేష్‌గౌడ్, నరేంద్రాచారి తదితరులు ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాలకు చెందిన ఆరీష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మిత్రుడి మరణాన్ని తెలుసుకుని కుటుంబానికి అండగా ఉండేందుకు స్నేహితులు శుక్రవారం మృతుడి ఇంటికి వెళ్లి రూ.22 వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వంశీకృష్ణశర్మ, జగన్‌రెడ్డి, తిరుమలేష్, నర్సిరెడ్డి, రామోజి, శివకుమార్ పలువురు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

తాడూరు: మండలంలోని అంతారంలో కాంగ్రెస్ నాయకులు సీసీ రోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి కృషితో నిధులు మంజూరు చేశారన్నారు.

వడ్డెర సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాసులు

అచ్చంపేట రూరల్: నియోజకవర్గ వడ్డెర సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా జగపతి, వెంకటేష్, సైదులు, ప్రధాన కార్యదర్శిగా నారాయణ, కోశాధికారిగా పాండు, కార్యదర్శిగా రాజు, గౌరవ సలహాదారులుగా శ్రీనివాసులు, రఘునందన్, తిర్పతయ్యతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ... సంఘం బలోపేతం కోసం కృషి చేస్తానన్నారు.

పెద్దకొత్తపల్లి: సాతాపూర్‌లో వడ్డెర సంఘం సభ్యులు సమావేశమై గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా గోవిందు, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ పలువురిని ఎన్నుకున్నారు.

దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలో ఓ యువతిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన యువకుడిని కఠినంగా శిక్షించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శివశంకర్ డిమాండ్ చేశారు. యువకుడిపై తక్షణమే నిర్భయ చట్టం కింద కేసు నమోదు చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.



పెద్దూరులో కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి



వెల్దండలో అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



తెలకపల్లిలో విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు



లింగాల శివాలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

మార్మోగిన శివనామస్మరణ

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా శివనామస్మరణ మార్మోగింది. ఆయా గ్రామాలలో శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- నాగర్‌కర్నూల్ మండలంలోని గగ్గలపల్లి, గన్యాగుల, పెద్దముద్దునూర్, నల్లవల్లిలో శివాలయాలలో శివపార్వతుల కల్యాణాన్ని కొనసాగించారు.
- తెలకపల్లిలోని శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, పూజల అనంతరం శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా సాగింది. పెద్దూరు, గట్టునెల్లికుదురులో దేవాలయాలలో కల్యాణోత్సవంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు.
- మంచాలకట్టలో రామతీర్థలింగేశ్వరస్వామి, బుగ్గరామస్వామి ఆలయాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాకార్యక్రమాలు చేపట్టారు.
- పెద్దకొత్తపల్లి శివాలయంలో భక్తులు పెద్ద ఎత్తున హాజరై శివునికి జలాభిషేకాలు చేశారు. దేవల్‌తిరుమలాపురంలో శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.
- చారకొండ జూపల్లి, సిర్సనగండ్ల చంద్రాయన్‌పల్లిలో శివనామస్మరణతో మార్మోగింది.
- వెల్దండ మండలంలోని గుండాలలో అంబారామలింగేశ్వర స్వామి దేవాలయం కోనేరులో భక్తులు పుణ్యస్నానాలు చేసి ప్రత్యేక పూజలు చేశారు.



చారకొండలో శివపార్వతుల కల్యాణంలో భక్తులు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శివుడికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అజిలాపూర్ మల్లీశ్వర స్వామి కల్యాణోత్సవం శుక్రవారం రాత్రి 8గంటలకు వైభవంగా నిర్వహించారు. శనివారం ఎల్లమ్మతల్లికి బోనాల నిర్వహి స్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

- అమ్రాబాద్ అమరేశ్వరాలయం, నవనారసింహాలయం, పదర మండలంలోని అమరేశ్వరాలయం, రాయలగండి లక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయం, ఉడిమిళ్ల శివాలయం, మద్దిమడుగు శివాలయం, మారడుగు మార్కెండేయస్వామి ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పూజలు నిర్వహించారు.
- ఉప్పునుంతల మండలంలో కేదారేశ్వరాలయం, మొల్గర శివాలయం, మామిళ్లపల్లి లక్ష్మీనరసింహ్మస్వామి ఆలయం, వెల్టూరు వేంకటేశ్వరస్వామి, పెనిమిళ్ల, కాంసానిపల్లిలోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- లింగాల మండలంలో చెన్నంపల్లి వెళ్లే మార్గంలో ఉన్న పురాతన శివాలయంలో వేకులజామున నుంచి భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఇక్కడి ఆలయం ఆవరణలో హోమాలు, అభిషేకాలతో పాటు శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న భౌరాపూర్ భ్రమరాంబిక, మల్లికార్జున చెంచుల జాతరకు పలు చెంచు పెంటల నుంచి ప్రత్యేక బస్సులలో చెంచులు తరలివెళ్లారు.
- తాడూరు మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో శివరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రంలో శివమాలధారులు ర్యాలీ నిర్వహించి ఇరుముడి కట్టిన అనంతరం శ్రీశైలంకు ప్రయాణం చేశారు.
- బల్మూర్‌లో కొండనాగుల, కొండారెడ్డిపల్లి, గట్టుతుమ్మెన్, మైలారం, బాణాల, గోదల్, జినుకుంట, మహాదేవ్‌పూర్ శివాలయాల్లో పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. పెద్దగుడిబండి రామలింగేశ్వరాలయంలో శ్రీశైలం నుంచి వచ్చిన వేదపండితులచే కల్యాణోత్సవం కనులపండువగా జరిపించారు.
- తిమ్మాజిపేట మండలంలోని మారేపల్లి, నేరాళ్లపల్లి శివాలయాల్లో పూజలు నిర్వహించారు. గోపాల్‌పేట మండలంలోని బుద్దారం వద్ద శివాయలంలో పూజల్లో పాల్గొన్నారు.
- కల్వకుర్తి పట్టణంలోని వేంకటేశ్వరస్వామి, హనుమాన్, శివాలయం, కన్యకాపరమేశ్వరి దేవాలయం ప్రాంగణంలోని శివాలయాలలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని శిలార్‌పల్లిలో నిర్వహించిన పెద్దిరాజుపెద్దమ్మ వీధి నాటక ప్రదర్శన మూడు రోజులపాటు చేపట్టి ఆకట్టుకున్నారు.
- చారకొండ మండల కేంద్రంలో కనకదుర్గ దేవాలయంలో శుక్రవారం శివపార్వతుల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన విధుల్లో ఊరేగింపు నిర్వహించారు.
- మన్ననూర్‌లోని లింగమయ్యస్వామి ఆలయంలో శివ పార్వతులకు కల్యాణం ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువకులు, చిన్నారులు, గొబ్బెమ్మలు, కోలాటం ఆటపాటలు సాంస్కృతిక, అన్నదానం కార్యాక్రమాలు నిర్వహించారు.
- అచ్చంపేట పట్టణంలోని భక్త మార్కండేయ శివాలయంలో సుప్రభాతసేవ, ప్రాతః కాల పూజలు, అర్చనలు, సామూహిక అభిషేకాలు నిర్వహించారు. శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను అలంకరించి రథంపై ఊరేగింపుగా తీసుకువచ్చి కల్యాణం చేశారు.



కల్వకుర్తి వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



తిప్పాపూర్ సత్యసాయి ఆలయంలో..



మంచాలకట్ట రామతీర్థలింగేశ్వరస్వామి ఆలయంలో..



దేవల్‌తిరుమలాపూర్ శివాలయంలో ..



సిద్దాపూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు



బలాన్‌పల్లి ఆలయంలో యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



చారకొండలో..



జిల్లా జనరల్ ఆస్పత్రిలో కేక్ కట్‌చేస్తున్న స్టాఫ్ నర్సులు

తెలకపల్లి: మండలంలోని ఆలేరు పంచాయతీ పరిధిలోని స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మండల మహిళా సమైక్య కార్యదర్శి అమృత ఆధ్వర్యంలో మహిళలను సన్మానించారు. మహిళలు ఆర్థిక అక్షరాస్యత ద్వారా ఉన్నతంగా ఎదగాలని, చిన్నచిన్న వ్యాపారాలతో జీవనోపాదులను ప్రారంభిస్తూ రాణించాలన్నారు. కార్యక్రమంలో అమృత, సుధ, కౌసర్‌బేగం, పార్వతమ్మ, నక్షత్ర, బాలకిష్టమ్మ, కవిత, దుర్గ, శివలీల తదితరులు పాల్గొన్నారు.

జనరల్ ఆస్పత్రిలో..

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో శుక్రవారం స్టాఫ్ నర్సులు కేక్ కట్ చేసి మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుండాలని తెలిపారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో పంచాయతీ కార్యాలయం వద్ద ఐద్వ మహిళా సంఘం అధ్యక్షురాలు లావణ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అనేక పోరాటాల ఫలితంగా 33 శాతం రిజర్వేషన్ స్థానిక సంస్థలలో 50 శాతం రిజర్వేషన్, ఆస్తి వాటా, శ్రామిక వాటా, లైంగిక వేధింపులు చట్టం, నిర్భయ చట్టాలు వచ్చిన అవి కాగితాలకే పరిమితం అయ్యాయని విమర్శించారు. పేరుకు మహిళల పేరు చెప్పి ప్రతి చోట పురుషులు పెత్తనం చేస్తున్నారని ఇది సరికాదన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు పూర్తిగా రక్షణ లేకుండాపోయింది. గుజరాత్, మణిపూర్‌లో మహిళలను దారుణంగా చంపుతుంటే అక్కడ ఉన్న బీజేపీ ప్రభుత్వాలు కనీసం పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో ఈశ్వర్, శివలీల, వెంకటమ్మ, మమత, చిట్టెమ్మ, రజిత, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోడేరు: మండలంలో మహిళా దినోత్సవం సందర్భంగా ఆయా పంచాయతీల వద్ద ప్రత్యేకాధికారులు కార్మికులను శుక్రవారం సన్మానించారు. కోడేరు వద్ద ఎంపీడీఓ శ్రీనివాసులు మహిళా కార్మికులను సన్మానించారు.

చారకొండ: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు శుక్రవారం తహసీల్దార్ ప్రమీల, డిప్యూటీ తహసీల్దార్ విద్యాధరి, సీనియర్ అసిస్టెంట్ మంజులను ఉద్యోగులు, సిబ్బంది శాలువాతో సత్కరించారు.

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు, ఇతర మహిళా సిబ్బందిని ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్‌తో పాటు అధ్యాపకులు సత్కరించారు. మహిళా శక్తిని వారు కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్, అధ్యాపకులు శివుడు, రమేష్‌కుమార్, కురుమయ్య, స్వామి, జగన్నాథం తదితరులున్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలో శుక్రవారం వివిధ సంఘాల ఆధ్వర్యంలో మహిళా అధికారులు, ప్రజా ప్రతినిధులు, సంఘ సేవకురాళ్లను ఘనంగా సన్మానించారు.

మన్ననూర్: నల్లమల అటవీ లోతట్టు ప్రదేశంలోని భౌరాపూర్ చెరువు ఆలయ ప్రాంగణంలో మహాశివరాత్రి సందర్భంగా చెంచుల సమక్షంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం ద్వారా పంపిణీ చేసే సరుకులతో తయారు చేసిన వంటకాలను ప్రదర్శనగా ఉంచారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కమల, పద్మావతి, అమృత, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు మహిళలు పాల్గొన్నారు.



కోడేరులో కార్మికులను సన్మానిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసులు



అచ్చంపేటలో రైతులను సన్మానిస్తున్న రక్షిత మహిళా సంఘం సభ్యులు



మన్ననూరులో మాట్లాడుతున్న సీడీపీవో దమయంతి



ఆలేరులో మహిళలను సన్మానిస్తున్న సభ్యులు

కిష్టన్న ఆశయాలను కొనసాగిస్తాం

నాగర్‌కర్నూల్‌రూరల్: సీపీఎం పార్టీ ఉమ్మడి జిల్లా మొదటి జిల్లా కార్యదర్శిగా పనిచేసిన కామ్రేడ్ కిష్టన్న ఆశయాలను కొనసాగిస్తామని జిల్లా కార్యదర్శి పర్వతాలు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో కిష్టన్న 18వ వర్ధంతిని నిర్వహించారు. 20ఏళ్లుగా పార్టీ జిల్లా కార్యదర్శిగా పని చేయడంతో పాటు, ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై అనేక పోరాటాలు కొనసాగించారని తెలిపారు. ఆ పోరాటాలను అణిచివేసేందుకు కిష్టన్నను 20 నెలలపాటు రాజమండ్రి జైలులో నిర్బంధించినట్లు తెలిపారు. 20ఏళ్ల పాటు కొల్లాపూర్ మండలంలోని సింగోటం సర్పంచ్‌గా పనిచేసి ఏ ఒక్క అవినీతి మరకలేకుండా నిలిచిన నాయకుడన్నారు. అప్పట్లోనే రూ.75 వేల మిగులు పంచాయతీ సింగోటంను తీర్చిదిద్దారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, అశోక్, కాశన్న, రామయ్య, నరేందర్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: కిష్టన్న వర్ధంతి కార్యక్రమం శుక్రవారం సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పార్టీ మండల కార్యదర్శి శివవర్మతో పాటు పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సింగోటం గ్రామానికి చెందిన కిష్టన్న పేదల పక్షాన చేసిన పోరాటాలను స్ఫూర్తిగా తీసుకుని నేటితరం నాయకులు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో తారాసింగ్, మధు, సురేందర్, సతీష్ తదితరులున్నారు.



జిల్లా కేంద్రంలో కిష్టన్న చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

కోడేరు: మండల కేంద్రంలోని ఉమమహేశ్వర బ్రహ్మోత్సవాలు రెండవ రోజు శుక్రవారం కొనసాగాయి. శివరాత్రి సందర్భంగా స్వామి వారికి గణపతి, సర్వదేవతా తదితర పూజాలు నిర్వహించి తీర్థప్రసాదలు అందించినట్లు అర్చకుడు జంగం శివయ్య తెలిపారు.

మహాలక్ష్మియాగానికి శ్రీకారం

కల్వకుర్తి: పట్టణంలోని ఫంక్షన్‌హాల్ ఆవరణలో మహాలక్ష్మి యాగం కార్యక్రమానికి శుక్రవారం అంకురార్పణ చేశారు. మూడు రోజులపాటు ఈ యాగం నిర్వహించనున్నారు. సోమిసిద్ది నాగరాజు స్వామి మార్గదర్శకంలో మహాలక్ష్మి యాగ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆదివారం 108 హోమకుండలాలతో వెయ్యి తామరపువ్వులతో ఈ యాగం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

షాట్ సర్క్యూట్‌తో గుడారం దగ్ధం

కొల్లాపూర్: పట్టణ సమీపంలోని ఈదమ్మ జాతరలో శుక్రవారం ఉదయం షాట్ సర్క్యూట్ కారణంగా గుడారం దగ్ధమైంది. పట్టణంలోని ఇందిరా కాలనీకి చెందిన గడ్డం కుమార్ జాతరలో మిఠాయి దుకాణం ఏర్పాటుచేసుకున్నారు. ఉదయం గుడారంలో మంటలు చెలరేగడంతో వాటిని ఆర్పేందుకు సమీప దుకాణాదారులు ప్రయత్నించారు. ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించగా, సిబ్బంది, స్థానికులు అందరూ కలిసి మంటలను అదుపుచేశారు. మంటలు చేలరేగేందుకు షాట్ సర్క్యూటే కారణమని యజమాని తెలిపారు.